క్లుప్తంగా

విధుల్లో చేరిన ఎస్సైలు


రాకేష్


వీరేంద్రబాబు

మనుబోలు: మనుబోలు ఎస్సైగా ఎంఎస్ రాకేష్ బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్సై అజయ్‌కుమార్ తిరుపతి జిల్లాకు బదిలీ కాగా ఆయన స్థానంలో రాకేష్ వచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటామన్నారు. రాత్రివేళల్లో దొంగతనాలను అరికట్టేందుకు గస్తీని పెంచుతామన్నారు.

• **తోటపల్లిగూడూరు:** తోటపల్లిగూడూరు పోలీస్‌స్టేషన్ ఎస్సైగా వీరేంద్రబాబు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న జంపానీకుమార్ దగదర్తికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఇందుకూరుపేట పనిచేస్తున్న వీరేంద్రబాబు నియమితులయ్యారు.

ఇసుక కొరత రాకుండా చర్యలు

• జేసీ కార్తీక్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ఇసుక కొరత రాకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ అన్నారు. జిల్లాలో గుర్తించిన ప్రదేశాల్లో ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి చూపిన వారితో ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సమావేశమయ్యారు. టెండరింగ్ విధానంతో ఆలస్యమై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారని, ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఆసక్తి ఉన్న వారితో ఎం ప్యానెల్ లిస్ట్ తయారు చేశామన్నారు. జిల్లాలోని సూరాయపాళెం, సంగం, నెల్లూరు బ్యారేజీల వద్ద గల ప్రాంతాల్లో డ్రెడ్జింగ్ చేసి ఇసుక డీసిల్టేషన్ ప్రక్రియను చేపడుతున్నామన్నారు. పూర్తి పారదర్శకంగా బిల్లింగ్ తదితర పనుల్లో లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. సమావేశంలో మైన్స్ ఉపసంచాలకులు శ్రీనివాసరావు, డీటీసీ చందర్, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నేడు స్పోర్ట్స్ ర్యాలీ


లెమన్ అండ్ స్పూన్ పోటీలో పాల్గొన్న మహిళలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్ వద్ద నుంచి గురువారం ఉదయం 7 గంటలకు క్రీడా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్కే యతిరాజ్ తెలిపారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాల్లో భాగంగా బుధవారం ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫుట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, త్రోబాల్, యోగా, లెమన్ అండ్ స్పూన్ రేస్ తదితర పోటీలను నిర్వహించారు. క్రీడా ర్యాలీని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సెట్నల్ సీఈఓ వెంకటయ్య, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కోచ్‌లు, వివిధ విభాగాలకు చెందిన క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలి

• ఏఐఎస్ఎఫ్ రిలే నిరాహార దీక్ష

నెల్లూరు(దర్గామిట్ట): రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని కలెక్టర్ కార్యాలయం ఎదుట అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో బుధవారం రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మస్తాన్ షరీఫ్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాల్లేక అద్దె భవనాల్లో విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారని, అనేక మార్లు జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లినా కనీసం ఆ భవనాల వైపు కన్నెత్తి కూడా చూడడం లేదని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. వసత గృహాల మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ప్రభుత్వ ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలన్నారు. నెలరోజుల్లో సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే చలో సచివాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాలను సందర్శించామని, ప్రస్తుతం అనేక వసతి గృహాల్లో సమస్యలను గుర్తించామన్నారు. నగరంలో ఉన్న కొన్ని వసతి గృహాల్లో పూర్తిస్థాయిలో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్ కిశోర్, నెల్లూరు నగర అధ్యక్షుడు శివం వర్మ, జిల్లా నాయకులు ప్రసాద్, అబ్దుల్, జాహ్నవ్, యస్దాని, నరసింహ, శరణ్, జీవన్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.



భద్రతాపరమైన చర్యలు చేపట్టాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన అమానుషం. ఈ ఘటనపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విచారణను వేగవంతం చేసి దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆస్పత్రుల్లో భద్రతాపరమైన చర్యలు చేపట్టాలి. వైద్యసిబ్బంది రక్షణకు ప్రత్యేక చట్టాలను తీసుకురావాలి.

– బి.నరసమ్మ, హెల్త్‌సూపర్‌వైజర్, చేజర్ల పీహెచ్‌సీ

మార్పు రావాలి



దాడులకు పాల్పడటం నేరం. ప్రజల్లోనే మార్పు రావాలి. చిన్న వయస్సు నుంచే పిల్లలకు మంచి బుద్ధులను నేర్పాలి. దీంతో మార్పొస్తుంది. భవిష్యత్తు తరాలకు రక్షణ కల్పించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ప్రభుత్వం ఈ దిశగా ఆలోచన చేయాలి.

– ఉషాసుందరి, ఆర్‌ఎంఓ, ప్రభుత్వాస్పత్రి, ఆత్మకూరు



గ్రామాల్లో పర్యటించి చైతన్యం తేవాలి

• ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశం

కొడవలూరు : పోలీసు అధికారులు, సిబ్బంది గ్రామాల్లో పర్యటించడం ద్వారా గొడవలు చోటుచేసుకోకుండా ప్రజల్లో చైతన్యం తేవాలని ఎస్పీ జి.కృష్ణకాంత్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. కొడవలూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించడంతో పాటు కేసుల పురోగతి గురించి సీఐ సురేంద్రబాబును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఎస్పీ పలు సూచనలు చేశారు. గొడవల వల్ల జరిగే నష్టాలను ప్రజలకు వివరంగా తెలియజేయడం ద్వారా గొడవలను నియంత్రించాలన్నారు. ప్రధానంగా హైవే మొబైల్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. గంజాయి తరలింపును పూర్తిస్థాయిలో కట్టడి చేయాలన్నారు. హైవేపై ప్రమాదాలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించడంతో పాటు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. ఎస్పీ వెంట సీఐ ఎ.సురేంద్రబాబు, పోలీసు సిబ్బంది పి.వెంకటేశ్వర్లు, సిరాజ్, రామ్మోహన్ తదితరులు ఉన్నారు.

ఆకస్మిక తనిఖీ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : పట్టణంలోని బుచ్చిరెడ్డిపాళెం పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ కృష్ణకాంత్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టిక, కేసుల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో సిబ్బంది అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.


విడవలూరు : పోలీస్ సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

• **విడవలూరు :** మండల కేంద్రమైన విడవలూరులోని పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ జి.కృష్ణకాంత్ బుధవారం సందర్శించారు. పలు రికార్డులను ఆయన పరిశీలించారు. ఇసుక అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాలు, మహిళలపై అఘాయిత్యాలు వంటి పలు కేసులపై ఆరా తీశారు. అనంతరం పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సీఐ సురేంద్రబాబు, ఎస్సై సాయిప్రసాద్ పాల్గొన్నారు.


కొడవలూరులో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణకాంత్

వైభవంగా ఉట్టి మహోత్సవం

పొదలకూరు: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి స్థానిక శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఉట్టి మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు గోపికల వేషధారణలో ఉట్టి మహోత్సవంలో పాల్గొన్నారు. ఆలయ నిర్వాహక కమిటీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

• **ముత్తుకూరు:** శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు మండలంలో ముగిశాయి. ముత్తుకూరు, కృష్ణపట్నం, మల్లూరు తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి మొదలైన శ్రీకృష్ణుడి గ్రామోత్సవం బుధవారం ఉదయం వరకు జరిగింది. మూడో రోజు కృష్ణ మందిరాల వద్ద ఉట్టి వేడుకలు ఘనంగా జరిగాయి.


ముత్తుకూరు: మల్లూరులో గ్రామోత్సవం


పొదలకూరు: ఉట్టి మహోత్సవంలో పాల్గొన్న వారు

కల్యాణ మండపం నిర్మాణానికి పూజలు

పొదలకూరు: స్థానిక శ్రీనివాస లేఅవుట్ శ్రీలక్ష్మి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలో కల్యాణ మండపం నిర్మాణానికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అధ్యక్షుడు పెండ్యాల రమణయ్య నాయుడు మాట్లాడుతూ దాతల సహకారంతో వీలైనంత త్వరలో మండప నిర్మాణాన్ని పూర్తి చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, శ్యామ్‌ప్రసాద్, డి.రఘురామిరెడ్డి, సుబ్బానాయుడు, శేఖర్, డి.శ్రీనివాసులు, చొప్పా వెంకటేశ్వర్లు, తన్నీరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


పూజల్లో పాల్గొన్న దేవస్థానం నిర్వాహకులు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పొదలకూరు: పట్టణానికి సమీపంలో తోకంచి తిప్ప వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. బుధవారం పోలీసులు వివరాలు వెల్లడించారు. మర్రిపాడు మండలం పొంగూరుకండ్రిక గ్రామానికి చెందిన వి.మురళి తోకంచి పునరావాస కేంద్రంలో ఉన్న అత్తగారింటికి మోటార్‌బైక్‌పై వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా నెల్లూరు ఆస్పత్రికి తరలించారు.

ఇప్పటికిప్పుడు ఖాళీ చేయమంటే ఎలా?


మాట్లాడుతున్న బాధితులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ పరిధిలోని రామకృష్ణనగర్‌లో 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, ఇప్పుడు అధికారులు వచ్చి ఇళ్లు ఖాళీ చేసి మరో చోటుకు వెళ్లాలని చెబుతున్నారని స్థానికులు బుధవారం వాపోయారు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడ నివాసం ఉంటూ, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు పునరావాసం కూడా కల్పించకుండా ఇళ్లు ఖాళీ చేయమనడం సరైన పద్ధతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై నగర పంచాయతీ అధికారులు, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి స్పందించి చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

రూరల్ పీడబ్ల్యూఏ కన్వీనర్‌గా ప్రసాద్

నెల్లూరు(బృందావనం) : పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీడబ్ల్యూఏ) నెల్లూరు రూరల్ మండల కన్వీనర్‌గా పాస్టర్ సీహెచ్ ప్రసాద్‌ను నియమించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గడ్డం హనోక్, రాష్ట్ర అధ్యక్షుడు ఐఎస్ బెన్హర్‌బాబు ఆధ్వర్యంలో రైల్వేఫీడర్స్ రోడ్డులోని లోన్‌స్టార్ చర్చిలో జరిగిన మండల సమావేశంలో తనను నియమించారని ప్రసాద్ బుధవారం వివరించారు. మండలంలోని పాస్టర్లకు ఏ సమస్య వచ్చినా పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కమిషనర్ బాధ్యతల స్వీకరణ

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : నగర పంచాయతీ కమిషనర్‌గా చంద్రశేఖర్‌రెడ్డి బుచ్చిరెడ్డిపాళెంలోని ఆయన కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. పట్టణంలో పారిశుద్ధ్యం, పట్టణ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని వివరించారు.


కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి

వెంకటేశ్వరలో 'క్యాడెన్స్ సాఫ్ట్‌వేర్'పై శిక్షణ

కొడవలూరు : మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ, వీఎల్ఎస్ఐ విద్యార్థులకు 'క్యాడెన్స్ సాఫ్ట్‌వేర్'పై బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరు ఎంటపుల్ టెక్నాలజీస్ కంపెనీ నుంచి రిసోర్స్ పర్సన్‌లుగా శ్రీనివాస్, సుధీర్ వచ్చి క్యాడెన్స్ సాఫ్ట్‌వేర్‌లో మెళకువలు, ఉపయోగాలను వివరించారు. ఆర్‌అండ్‌డీ డీన్ డాక్టర్ వెంకట నాగేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ డాక్టర్ పి.గుణశేఖర్, ప్రిన్సిపల్ ప్రకాశం, అధ్యాపక బృందం పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ నేతకు కాకాణి పరామర్శ

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండ పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నేత కోసూరు రవీంద్రయ్యను మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. రవీంద్రయ్య కంటి సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల ఆపరేషన్ చేయించుకున్నాడు. ఈ క్రమంలో కాకాణి వరిగొండ గమళ్లపాళెంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు గూడూరు విష్ణుమోహన్‌రెడ్డి, కోటా శేఖర్‌రెడ్డి, గండవరపు శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.


రవీంద్రయ్యను పరామర్శిస్తున్న గోవర్ధన్‌రెడ్డి

తెలుగు భాషను కాపాడుకుందాం

మనుబోలు (వెంకటాచలం): తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం వీసీ విజయ్‌భాస్కర్ రావు అన్నారు. మండలంలోని కాకుటూరు వద్ద నున్న వర్సిటీలోని తిక్కన సాహితీ పీఠం నెల్లూరు తెలుగు శాఖ ఆధ్వర్యంలో బుధవారం తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్‌గా పిలువబడే తెలుగు భాష గొప్పతనాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా గిడుగు రామమూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వేదాల్లో విజ్ఞానం అనే అంశంపై బత్తిన సాయికుమార్‌రెడ్డి, అన్నమయ్య జానపద గేయాల్లో జానపద వైభవం అనే అంశంపై వీవీఎస్ వినోద్‌కుమార్ అన్నమయ్య కీర్తనలను వినిపించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్ విజయ, తెలుగు శాఖ అధిపతి డాక్టర్ ఎం.త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.


గిడుగు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

ఆదర్శంగా తీర్చిదిద్దుతా

కొడవలూరు : చంద్రశేఖరపురంలోని ఈఎంఆర్ఎస్(ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్)ను ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్‌ను ఆయన బుధవారం సందర్శించి పాఠశాల, జూనియర్ కళాశాలలోని వసతులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ కేంద్రం భారీగా నిధులు వెచ్చించి భవన సదుపాయాలు కల్పించిందే తప్ప నిర్వహణ గురించి పట్టించుకోలేదన్నారు. మొత్తం 430 మంది విద్యార్థులుంటే వీరికి బోధన సంతృప్తికరంగా సాగడం లేదన్నారు. మరుగుదొడ్లకు తలుపులు లేకపోవడం, నిర్మించిన డైనింగ్ హాలును ప్రారంభించకపోవడం, ఇండోర్ స్టేడియంను అసంపూర్తిగా వదిలేయడం లాంటి సమస్యలున్నాయని తెలిపారు. ప్రధానంగా హిందీ ఫ్యాకల్టీని నియమించడం వల్ల విద్యార్థులకు బోధన గొప్పగా లేదన్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఐటీడీఏ ఇన్‌చార్జి పీఓ పరిమళ, తహసీల్దార్ స్ఫూర్తి, ఎంఈఓలు జి.వసంతకుమారి, ఎన్.అంకయ్య, ప్రిన్సిపల్ విశ్వప్రతాప్ శుక్లా, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.


చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్‌లో వసతులను పరిశీలిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఎడమగట్టు కాలువకు నీటి విడుదల

పొదలకూరు: కండలేరు లో లెవల్ స్లూయిజ్ వద్ద ఉన్న పంపింగ్ స్కీమ్ ద్వారా ఎడమగట్టు కాలువకు సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బుధవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముందుగా రెండు మోటార్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నామన్నారు. తర్వాత ఒక మోటారు ద్వారా కాలువకు నీటిని వదలడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తెలుగుగంగ ఎస్ఈ వెంకటరామిరెడ్డి, ఈఈలు అనిల్‌కుమార్‌రెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, డీఈలు విజయరామిరెడ్డి, సురేఖ, రైతులు పాల్గొన్నారు.


గంగా హారతి ఇస్తున్న సోమిరెడ్డి

దాడి కేసులో నిందితుల అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): కార్యాలయంలో పనిచేసేందుకు వచ్చిన ముగ్గురు వ్యక్తులపై దాడి చేసిన ఘటనలో నిందితులను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి కథనం మేరకు.. బీవీ నగర్‌లో ఆన్‌లైన్ సర్వీస్ సెంటర్ ఉంది. అందులో మేనేజర్‌గా పీటర్, ఏసీ టెక్నీషియన్‌గా శిరీష్‌లు పనిచేస్తున్నారు. ఈ సెంటర్‌లో పనిచేసేందుకు వారు ఒడిశాకు చెందిన జుహేంద్ర దుంబూరి, పద్మిని దుంబూరి దంపతులతోపాటు మరో వ్యక్తిని ఈనెల 27వ తేదీన తీసుకొచ్చారు. అర్ధరాత్రి మేనేజర్, ఏసీ టెక్నీషియన్ మద్యం మత్తులో వారిపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను అరెస్ట్ చేశామని ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్ కిశోర్ కుమార్ బుధవారం తెలిపారు.

సర్వేపల్లిలో సోమిరెడ్డి రాజ్యాంగం

• కాంగ్రెస్ నాయకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి

మనుబోలు: సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి రాజ్యాంగం అమల్లో ఉన్నట్లు అనిపిస్తోందని కాంగ్రెస్ నాయకుడు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మనుబోలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అక్కంపేట గ్రామంలో పంచాయతీ తీర్మానాలను తుంగలో తొక్కి టీడీపీ నాయకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. పంచాయతీ తీర్మానం మేరకు ప్లాంట్‌ను తిరిగి ప్రారంభించామన్నారు. ఇక్కడ వైఎస్సార్ ఫొటో తొలగించకుంటే గ్రామంలో శాంతభద్రతల సమస్య ఉత్పన్నమవుతుందని పోలీసులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వైఎస్సార్ ఫొటోను తీసి వేసేందుకు ఒప్పుకోబోమని తేల్చి చెప్పారు. అంతకుముందు ఎంపీడీఓ కార్యాలయంలో కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ వర్గీయుల మధ్య సీఐ రాంబాబు, అధికారుల సమక్షంలో జరిగిన రాజీ చర్చలు విఫలమయ్యాయి. ఇరు వర్గాలు వాదోపవాదాలకు దిగాయి. తీవ్ర ఉద్రిక్తతల నడుమ రాజన్న జలధార ప్లాంట్‌ను ప్రారంభించారు.


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్‌రెడ్డి

వివాహిత ఆత్మహత్య

పొదలకూరు: మండలంలోని భోగసముద్రం గ్రామంలో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ప్రసన్న (22)కు భర్త, ఇద్దరు సంతానం ఉన్నారు. కుటుంబ కలహాలతో మంగళవారం రాత్రి ఆమె ఇంట్లో ఉరేసుకుంది. పోలీసులకు సమాచారం అందడంతో ఎస్సై ఎస్‌కే హనీఫ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించారు. బుధవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేద విద్యార్థులకు చేయూత

కోవూరు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు ఆర్థికంగా చేయూత అందిస్తానని వైస్ ఎంపీపీ శివుని నరసింహులురెడ్డి అన్నారు. కోవూరు పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో ప్రతిభ చూపిన ముగ్గురు విద్యార్థినులకు రూ.10 వేల వంతున బుధవారం వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద విద్యార్థులు ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నిర్మలానంద బాబా ఎంపీడీఓ శ్రీహరి, హెచ్ఎం ఝాన్సీరాణి, పీడీ దేవిక, స్కూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నగదును అందజేస్తున్న నరసింహులురెడ్డి